సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



యథేచ్ఛగా మట్టి తరలింపు

ఇటుక వ్యాపారుల ఆగడాలు మితిమీరుతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు ఉనికిని కోల్పోయే దుస్థితి నెలకొంది. 8లో▸



ఆరోగ్యమే.. మహాభాగ్యం

ఆరోగ్య సంరక్షణపై ప్రతీ ఒక్కరు దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. 8లో▸



ఫ్యూచర్‌లో విలీనం చేయండి

మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఫార్మా భూముల సర్వే



యాచారం-కడ్తాల్ మండలాల సరిహద్దులో సర్వే చేస్తున్న అధికారులు

యాచారం: ఫార్మాసిటీ భూముల సర్వే సోమవారం ప్రశాంతంగా జరిగింది. యాచారం-కడ్తాల్ మండలాల సరిహద్దులోని నక్కర్తమేడిపల్లి, పల్లెచల్కతండా, నానక్‌నగర్‌లో యాచారం తహసీల్దార్ అయ్యప్ప ఆధ్వర్యంలో 20 మందికి పైగా టీజీఐఐసీ, రెవెన్యూ, సర్వే అధికారులు ఫార్మాసిటీకి సేకరించిన అసైన్డ్, పట్టా భూములను సర్వే చేశారు. ముందు జాగ్రత్త చర్యగా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నక్కర్తమేడిపల్లి- పల్లెచల్కతండా రోడ్డుపై రాకపోకలు సాగించే కార్లు, బైక్‌లు, ఇతర వాహనాలను తనిఖీ చేశారు. ఏ గ్రామం ..ఎక్కడికి వెళ్తున్నారు.. అంటూ ఆరా తీశారు. నక్కర్తమేడిపల్లి, పల్లెచల్కతండా, నానక్‌నగర్ గ్రామాల్లో ఆందోళనకారులపై నిఘా పెట్టారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



నక్కర్తమేడిపల్లిలో సమావేశమైన ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి నేతలు, రైతులు

యాచారం: బీఆర్ఎస్ సర్కార్ నాడు ఫార్మాసిటీ పేరుతో భూసేకరణ చేస్తే అధికారంలోకి వస్తే తిరిగి భూములు ఇస్తామని మాటిచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా నేడు రైతులను మోసం చేస్తోందని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నేతలు పేర్కొన్నారు. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నక్కర్తమేడిపల్లిలో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన రైతులు సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని, కోర్టు ఉత్తర్వులను అధికారులైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీ భూముల్లో సర్వే, ఫెన్సింగ్ పనులు వెంటనే ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నేతలు కవులు సరస్వతి, నారాయణ, గణేశ్, రాజశేఖర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, సామ నిరంజన్, భగవంత్‌రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే అభివృద్ధి సాధ్యం



నూతన సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న బర్క కృష్ణయాదవ్

షాద్‌నగర్: బీసీలు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ అన్నారు. పట్టణంలోని బీసీసేన నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాసవరలక్ష్మి స్వగృహంలో సోమవారం నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖరప్ప ఆధ్వర్యంలో బీసీసేన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, ఫరూఖ్‌నగర్ మండల మహిళా అధ్యక్షురాలిగా జలజ, పట్టణ అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మిగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బర్క కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రావాల్సిన హక్కులు, రిజర్వేషన్లను కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నాయని విమర్శించారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయే తప్ప వారి కష్టాలు పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. అనంతరం నూతనంగా నియమితులైన వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివ, నరేష్, భూషణ్, నరేష్, చందులాల్, వరకుమార్, వెంకటేశ్, రవి, మారుతి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి

తాండూరు టౌన్: మున్సిపల్ అధికారులు ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇకపై మున్సిపల్ పరిధిలో ఎలాంటి క్రయవిక్రయాలు జరిగినా రుసుం చెల్లించాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఇందులో భాగంగా పట్టణంలో ఏళ్ల తరబడిగా మూతపడిన తైబజార్ వసూళ్లకు తిరిగి రంగం సిద్ధం చేసుకున్నారు. ఇటీవలే తైబజార్ బహిరంగ వేలం వేయడంతో ఓ కాంట్రాక్టర్ రూ.10,25,100కు వేలం దక్కించుకున్నారు.

బండ భారం

రూ.4.50 కోట్లు



నేటి నుంచి ఒక్కో సిలిండర్‌పై రూ.50 పెంపు

- జిల్లాలో తొమ్మిది లక్షలపైనే గ్యాస్ కనెక్షన్లు
- రోజుకు సగటున 30 వేల బుకింగ్స్ నమోదు
- పేద, మధ్య తరగతి కుటుంబాల నెత్తిన పిడుగు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వంటగ్యాస్ ధర మరోసారి భగ్గుమంది. కేంద్రం ఒక్కో సిలిండర్‌పై ఏకంగా రూ.50 చొప్పున పెంచి షాక్ ఇచ్చింది. ఇప్పటికే బియ్యం, పప్పు, నూనెల వంటి నిత్యావసరాలతో పాటు, ఇతర ఖర్చులతో సతమతమవుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు తాజా ధరలు భారంగా మారనున్నాయి. ప్రస్తుతం 14.2 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.855 ఉండగా, తాజా పెంపుతో రూ.905కు చేరింది. దీంతో జిల్లా వాసులపై నెలకు సగటున రూ.4.50 కోట్ల భారం పడనుంది. పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని వామపక్ష పార్టీలు సహా మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

రోజుకు అదనంగా రూ.15 లక్షలు

జిల్లాలో తొమ్మిది లక్షలకుపైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు అంచనా. ఇండియన్, భారత్, హెచ్‌పీ సహా ఇతర ఆయిల్ కంపెనీల్లో రోజుకు సగటున 30 వేల బుకింగ్స్ నమోదవుతుంటాయి. ఒక్కో సిలిండర్‌పై రూ.50 పెంపుతో రోజుకు సగటున జిల్లావాసులపై రూ.15 లక్షలు అదనపు భారం కానుంది. ఈ లెక్కన నెలకు రూ.4.50 కోట్ల భారం పడినట్టే. తాజాగా మళ్లీ ధర పెంచడంతో డొమెస్టిక్ గ్యాస్ వినియోగదారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇక పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్‌కు రూ.2 చొప్పున పెంచినప్పటికీ.. భారాన్ని ఆయిల్ కంపెనీలే భరించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. దీంతో వాహనదారులకు ఊరట కల్పించింది.

ఐదేళ్లలో గ్యాస్ ధరల పెంపు

సంవత్సరం	సిలిండర్ ధర
2020 మే	రూ.589
2021 అక్టోబర్	రూ.646
2021 మార్చి	రూ.871
2022 మార్చి	రూ.957
2022 మే	రూ.1055
2022 జూన్	రూ.1062
2022 జూలై	రూ.1,105
2023 మార్చి	రూ.1,155
2023 ఆగస్టు	రూ.955
2024 మార్చి	రూ.855
2025 ఏప్రిల్	రూ.905

సామాన్యులపై పెనుభారం



కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్ ధరలను పెంచి పెనుభారం మోపుతోంది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి సిలిండర్ల ధరలు పెంచుతూనే ఉంది. పెరిగిన గ్యాస్ సిలిండర్ల ధరలతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

– వి.లక్ష్మి, గృహిణి, ఆమనగల్లు

వెంటనే తగ్గించాలి



వంట గ్యాస్ సిలిండర్ ధర ఇప్పటికే మోయలేనంతగా ఉంది. ప్రభుత్వం మరింత ధర పెంచటం సరికాదు. కూలి పనులు చేసుకునే పేదలకు వంటగ్యాస్ ధరలు భరించలేని విధంగా మారుతున్నాయి. పెంచిన ధరలు వెంటనే తగ్గించాలి.

– సుధ, గృహిణి, అజీజ్‌నగర్, మొయినాబాద్ మండలం

పునరాలోచన చేయాలి



గ్యాస్ ధర పెంచొద్దు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, వస్తువుల ధరలు నింగినంటాయి. మళ్లీ గ్యాస్ ధర పెంచితే పేద, మధ్య తరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడతారు. కేంద్రం పునరాలోచన చేయాలి.

– పి.మున్నీ, ఐద్వా నాయకురాలు, ఇబ్రహీంపట్నం

ప్రజల నెత్తిన పిడుగు



వంటగ్యాస్ ధరలు పెంచడమంటే సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజల నెత్తిన పిడుగు పడినట్లే. కేంద్ర ప్రభుత్వం ఇష్టారీతిన గ్యాస్ ధరలు పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.

– రాధిక, గృహిణి, మల్లారెడ్డిగూడ, చేవెళ్ల మండలం

ధర పెంపు సరికాదు



ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌ను ధరను పెంచడంతో పేదలపై ఆర్థిక భారం పడుతుంది. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. గ్యాస్ ధరను పెంచడం సరికాదు.

– గౌతమి, షాద్‌నగర్



ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు

- పుట్ట మన్ను తెచ్చి హోమగుండాల ఏర్పాటు
- విశ్వక్సేనుడి ఆరాధనతో ఉత్సవాలు ప్రారంభించిన అర్చకులు

మొయినాబాద్: కలియుగదైవం.. చిలుకూరు బాలాజీ స్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అంకురార్పణ చేశారు. ఆలయ ప్రధాన మండపంలో స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి బ్రహ్మోత్సవాల పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదట సెల్వర్ కూత్తు.. వేద మంత్రోచ్ఛరణతో దేవాలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం పుట్ట బంగారం (పుట్టమన్ను) తీసుకొచ్చి హోమగుండాలు ఏర్పాటు చేశారు. అందులో నవధాన్యాలు, పాలికలు కలిపి హోమాలను వెలిగించారు. తరువాత విశ్వక్సేనుడి ఆరాధన, పుణ్యాహవచన కార్యక్రమాలు చేపట్టారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ఊరేగించిన అనంతరం యజ్ఞం చేపట్టారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమైన కార్యక్రమాలు అర్ధరాత్రి వరకు కొనసాగాయి. పూజా కార్యక్రమాలు తిరుమల కిరణాచారి, రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, నరసింహన్, కన్నయ్య, కిట్టు, మురళి, కృష్ణమూర్తి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండోరోజు ధ్వజారోహణం, శేషవాహనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ధ్వజారోహణం సందర్భంగా గరుత్మంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభానికి గరుడ పతాన్ని ఆరోహణం చేస్తారు. ఈసారి గరుడ ప్రసాదం పంపిణీ ఉండదని.. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని ఆలయ అర్చకుడు రంగరాజన్ స్పష్టం చేశారు.

మే 3, 4 తేదీల్లో మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో

సాక్షి, సిటీబ్యూరో: మోహిదీపట్నంలోని కింగ్స్ క్రౌన్ కన్వెన్షన్‌లో మే 3, 4 తేదీల్లో మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎజాజ్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తొలిసారిగా టెన్త్ నుంచి సివిల్స్ విద్యార్థుల వరకు ప్రత్యేక విభాగాలుగా ఎక్స్‌పో ఉంటుందన్నారు. ఒకే గొడుగు కింద విద్యాసంస్థలు, పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ స్టాళ్లు అందుబాటులో ఉంటాయన్నారు. 150 విద్యా సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. విద్యార్థులకు అవకాశమున్న కోర్సులు, మౌలిక సదుపాయాల గురించి అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఎక్స్‌పోలో పాల్గొనదలచిన వారు 88588 45599/ 88588 43344 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



పిల్లలే పెద్దలై..



- ఘనంగా ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ థియేటర్ ఫెస్టివల్ షురూ
- ఆలోచింపజేసిన చిన్నారుల నాటక ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: రంగస్థల నాటక రంగాన్ని కాపాడుకునేందుకు చిన్నారులు నడుం బిగించారు. ఈ మేరకు మొట్టమొదటి ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ థియేటర్ ఫెస్టివల్ సోమవారం రవీంద్రభారతిలో ప్రారంభించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నిశుంబిత స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో ఈ ఉత్సవం నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయి పిల్లలకు నాటక పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ వేడుకల్ని మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ రామ్ తెలిపారు. మొదటి రోజు జపాన్‌కు చెందిన రంగస్థల కళాకారులు 'లూనర్' అనే అంశంపై ప్రదర్శించిన నాటకం ఆకట్టుకుంది. ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు 'మార్పు రావాలి' అనే అంశంపై ప్రదర్శించిన నాటకం ఆహూతులను ఆలోచింపచేసింది. ది జంగిల్‌బుక్, అయ్యో పాపం, కుయ్యో ముర్రో నాటకాలు కూడా అలరించాయి. ఈ సందర్భంగా జపాన్ థియేటర్ డైరెక్టర్ ఎరీనా సాజి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా రంగస్థల నాటక రంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచే థియేటర్ ఆర్ట్స్‌ను ఒక పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ నగరంలో మొట్టమొదటి అంతర్జాతీయ బాలల ఉత్సవాన్ని నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ ఫెస్టివల్ యువతలో సృజనాత్మకతను పెంపొందిస్తున్నారు. కాగా రెండవ రోజు నుంచి నేపాల్, భూపాల్, కోల్‌కత్తా, కేరళ వంటి ప్రాంతాలకు చెందిన కళాకారులు హాజరై తమ ప్రదర్శనలను ఇవ్వనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

యువతలో నైపుణ్యాన్ని వెలికితీయాలి



యంగ్‌ఇండియా స్కిల్ యూనివర్సిటీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

రాయదుర్గం: తెలంగాణలోని యువతలో నైపుణ్యాన్ని వెలికితీసి వారిని ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దుతామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోనే అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులకు చిరునామాగా రాష్ట్రాన్ని మార్చాలనే సంకల్పంతోనే యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ యువతకు కొదవ లేదని, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ అందిస్తే మరింత మెరుగ్గా తయారవుతారన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు సాఫ్ట్ స్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆయన సూచించారు. రాష్ట్రంలోని ప్రముఖ విద్యా, పరిశోధన, టాస్క్, డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీఈఈటీ)తదితర సంస్థలతో సమన్వయం చేసుకోవాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఐటీ శాఖా ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, డిప్యూటీ సెక్రెటరీ భవేష్‌మిశ్రా, స్కిల్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ సుబ్బారావు, ఓఎస్డీ చమన్ మెహతా తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ గ్రీన్ మార్కెట్ 'కోహెడ'

దేశంలో రెండో అతిపెద్ద పండ్ల విపణి

- 199.12 ఎకరాల్లో నిర్మాణం
- ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.2,900 కోట్లు
- 67 శాతం నిధులు నాబార్డ్ రుణం ద్వారానే..
- విదేశీ ఆహార ఉత్పత్తుల కోసం ప్రత్యేకంగా హాల్
- డీపీఆర్‌ను రెడీ చేసిన తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ



సాక్షి, రంగారెడ్డి జిల్లా: దేశంలోనే విస్తీర్ణంలో రెండో అతిపెద్ద మార్కెట్ తెలంగాణలో నిర్మితమవుతోంది. ప్రస్తుతం 200 ఎకరాల్లో హర్యానాలోని ఐబిహెచ్‌ఎం గనౌర్ అంతర్జాతీయ ఉద్యానవన మార్కెట్ నిర్మాణంలో ఉంది. రూ.2 వేల కోట్ల వ్యయంతో పబ్లిక్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలో దీన్ని నిర్మిస్తున్నారు. ఇంచుమించు ఇదే స్థాయిలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో 199.12 ఎకరాల విస్తీర్ణంలో 'కోహెడ గ్లోబల్ గ్రీన్ మార్కెట్'ను నిర్మిస్తున్నారు. మొత్తం రూ.2,900.43 కోట్ల అంచనా వ్యయంతో మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 33 శాతం నిధులను వెచ్చిస్తుండగా..మిగిలిన 67 శాతం నాబార్డ్ నుంచి టర్మ్ లోన్ రూపంలో సమీకరించనుంది. ఈ మేరకు తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ విభాగం కోహెడ హోల్‌సేల్ మార్కెట్ డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను రూపొందించి న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ స్టేట్ అగ్రికల్చరల్ మార్కెటింగ్ బోర్డుకు అందజేసింది.

- ప్రతిపాదిత కోహెడ గ్లోబల్ గ్రీన్ మార్కెట్‌లో పండ్లు, పూలు, పాలు, మాంసం, కోళ్ల వ్యాపారంతో పాటు సముద్ర ఉత్పత్తులను విక్రయిస్తారు. దీన్ని ఈపీసీ (ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్), పీపీపీ రెండు విధానాల్లో అభివృద్ధి చేయనున్నారు. ఈపీసీ విధానానికి 167.85 ఎకరాలు, పీపీపీ విధానంలో 31.27 ఎకరాలను కేటాయించారు. ఈపీసీలో వేలం హాళ్లు, షెడ్లు, విదేశీ ఫ్లాగ్‌షిప్ పెవిలియన్, రిటైల్ జోన్లు, మినీ డేటా సెంటర్, కార్మికుల విశ్రాంతి గదులు, పాలీక్లినిక్, పోలీసు ఔట్‌పోస్టు, పార్కింగ్, ఎస్‌టీపీలు, రహదారులు వంటివి నిర్మిస్తారు. పీపీపీ విధానంలో పెట్రోల్ పంపులు, టవర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, ఛార్జింగ్ స్టేషన్, శీతల గిడ్డంగులు, షాపులు, ప్రాసెసింగ్ సెంటర్ల వంటివి ఉంటాయి. ఈపీసీ అభివృద్ధి పనులకు రూ.2,044 కోట్లు, పీపీపీ విధానంలో రూ.856.43 కోట్ల అభివృద్ధి పనుల వ్యయాన్ని అంచనా వేశారు.
- ఫ్రాన్స్‌లోని రుంగిస్ మార్కెట్, లండన్‌లోని న్యూ కోవెంట్ గార్డెన్ మార్కెట్, బర్మింగ్‌హామ్‌లోని బర్మింగ్‌హామ్ హోల్‌సేల్ మార్కెట్, ఆమ్‌స్టర్‌డ్యామ్‌లోని ఫుడ్ సెంటర్, అమెరికాలోని యూనియన్ స్క్వేర్ గ్రీన్ మార్కెట్, ఫెర్రీ ప్లాజా ఫార్మర్ బజార్, దుబాయ్‌లోని వాటర్ ఫ్రంట్ మార్కెట్, కువైట్‌లోని ఆల్ఫ్రోర్డ్ మార్కెట్లను అధ్యయనం చేసిన వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు కోహెడ మార్కెట్‌ను డిజైన్ చేశారు. మొత్తం స్థలంలో 71.58 ఎకరాలను రహదారులు, నీటి సరఫరా, మురుగు నీటి పారుదల, ఘన వ్యర్థాల నిర్వహణ, విద్యుత్ సబ్ స్టేషన్ వంటి మౌలిక సదుపాయాల కోసమే కేటాయించారు.

మార్కెట్‌లో దేనికి ఎంత ఖర్చంటే? (రూ.కోట్లలో)

- భూ సమీకరణ: 350
- భవన నిర్మాణాలు: 1,324.5
- యంత్రాలు: 211.65
- ఇతర స్థిరాస్తులు: 66.15
- కంప్యూటర్, నెట్‌వర్కింగ్: 1.76
- నిర్వహణ: 73.37
- టెక్నాలజీ నవీకరణ, ఎస్కలేషన్: 15.25
- మిగిలినవి సెక్యూరిటీ డిపాజిట్లు, ఇతరత్రా వ్యయం

విదేశీ ఉత్పత్తుల కోసం ప్రత్యేకం..

2047 నాటికి మార్కెట్ సామర్థ్యం సుమారు 13.6 లక్షల మెట్రిక్ టన్నులకు పెరుగుతుందని అంచనా. కోహెడ మార్కెట్ యార్డ్‌లో 8 షెడ్లు ఉంటాయి. రెండు సోలార్ రూఫ్ టాప్‌లతో కూడిన మెజనైన్ హాళ్లు, మరో రెండు సోలార్ రూఫ్ టాప్ హాళ్లు ఉంటాయి. అంతర్జాతీయ వ్యాపారస్తులకు ప్రత్యేకంగా ఫ్లాగ్‌షిప్ పెవిలియన్ ఉంటుంది. ఇందులో విదేశీ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు చేసుకోవచ్చు.

స్మార్ట్ మండి..

కోహెడ మార్కెట్‌ను ఆధునిక స్మార్ట్ మండిగా అభివృద్ధి చేయనున్నారు. స్మార్ట్ వీధి దీపాలు, ఎలక్ట్రానిక్ సైన్‌బోర్డ్‌లు, ఎన్విరాన్‌మెంట్ మానిటరింగ్ సిస్టమ్, ఇన్ఫర్మేషన్ కియోస్క్‌లు, పబ్లిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్, వీడియో మేనేజ్‌మెంట్, అనలిటిక్స్‌తో కూడిన నిఘా వ్యవస్థ, సీసీటీవీ కెమెరాలు, సెంట్రల్ మానిటరింగ్ సిస్టమ్, మినీ డేటా సెంటర్ ఉంటుంది. ఇక్కడ మౌలిక సేవలన్నీ సాంకేతికతతో అనుసంధానమై ఉంటాయి.

రోజుకు 3 లక్షల లీటర్ల నీటి సరఫరా

ఔటర్ రింగ్ రోడ్ నుంచి కోహెడ మార్కెట్ వరకు నాలుగు లైన్ల రహదారిని నిర్మించారు. 3.61 ఎకరాల్లో విద్యుత్ సబ్ స్టేషన్ల కోసం కేటాయించారు. మిషన్ భగీరథ నుంచి రోజుకు 3 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేయనున్నారు. రూ.5.2 కోట్ల వ్యయంతో ప్రత్యేక పైప్‌లైన్ వేయనున్నారు. మార్కెట్‌లో ప్రైవేట్ శీతల గిడ్డంగులు, రిటైల్ షాప్‌లతో పాటు ఆఫీసులు, అంతర్జాతీయ ఎగ్జిబిషన్ సెంటర్, సాలిడ్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఈవీ చార్జింగ్ స్టేషన్లు, వాటర్ అండ్ వేపర్ హీట్ ట్రీట్‌మెంట్లు ప్లాంట్ల వంటివన్నీ ఉంటాయి. సిబ్బంది, కార్మికులకు గృహాలను సైతం నిర్మించనున్నారు.

ఆరోగ్యమే.. మహాభాగ్యం



ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, వైద్య సిబ్బంది

డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

షాద్‌నగర్: ఆరోగ్యమే మాహా భాగ్యమని.. ఆరోగ్య సంరక్షణపై ప్రతీ ఒక్కరు దృష్టి సారించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి నుంచి ఫరూఖ్‌నగర్ పురవీధుల్లో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈర సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉరుకులు పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. సమయానికి పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. నిత్యం శరీరానికి అవరసమరైన నీటిని సేవించాలన్నారు. వ్యాయామాన్ని నిత్యం అలవాటు చేసుకోవాలని.. ఒత్తిడికి, దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. భోజనంలో మసాలాలు, కారం, పులుపు, వేపుడు పదార్థాలు తగ్గించాలన్నారు. మొలకెత్తిన గింజలు తరుచుగా తీసుకోవాలని, వేడి పదార్థాలను భుజించాలన్నారు. అనారోగ్యానికి గురైన వారు వెంటనే సమీపంలో ఉండే వైద్యులను సంప్రదించి చికిత్సలు చేయించుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాలకే ప్రమాదమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ముస్తకిన్ అహ్మద్, జగదీశ్, సంధ్య, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్ వైజర్లు రమ, అమృత, రవికుమార్, లింగం, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుడి మృతి



క్రీడాక్షేత్రం అధికారి శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

యాచారం: ఓ కాంట్రాక్టు కార్మికుడు తీవ్ర అస్వస్థకు గురై మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గునుగల్ క్రీడాక్షేత్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. గునుగల్ గ్రామానికి మహ్మద్ జహంగీర్ కొన్నేళ్లుగా స్థానిక క్రీడాక్షేత్రంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే విధులు నిర్వహిస్తుండగా సోమవారం ఉదయం 11 గంటల సమయంలో తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు, గమనించిన కూలీలు వెంటనే యాచారం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఆయన పరిస్థితి విషమించడంతో ఆయన్ను ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు పి.బ్రహ్మయ్య, చందునాయక్ తదితరులు క్రీడా క్షేత్రం వద్దకు వెళ్లి మృతుడి కుటుంబానికి రూ.5లక్షల పరిహారం అందజేయాలని.. కుటుంబంలో ఒకరికి క్రీడా క్షేత్రంలో పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ మేరకు వారు క్రీడాక్షేత్రం అధికారి శ్రీకాంత్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం.

యువకుడి అదృశ్యం



రాకేశ్ (ఫైల్)

కేశంపేట: మెడికల్ షాప్‌లో పనిచేసే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొత్తపేటలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రొయ్యల రాకేశ్ స్థానికంగా ఓ మెడికల్ షాప్‌లో పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం మధ్యాహ్న భోజనానికి వచ్చిన ఆయన తిరిగి పనికి వెళ్లలేదు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో అతడి ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రాకేష్ తల్లి యాదమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

రాపిడో రైడర్

ఇబ్రహీంపట్నం: ఇంటి నుంచి వెళ్లిన యువ కుడు (రాపిడో రైడర్) అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. బాలపూర్ మండలం ఆర్‌జీకే కుర్మల్‌గూడలో నివాసముండే కడమంచి అఖిల్ (21) రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తున్నా డు. ఈ నెల 4న ఇంటి నుంచి అఖిల్ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. యువకుడి సోదరి స్రవంతి పలుమార్లు ఫోన్ చేయగా వస్తున్నా అని చెబుతూ.. ఇంటికి వెళ్లలేదు. ఆదివారం సాయంత్రం నుంచి ఫోన్‌స్విచ్ఛాఫ్ వస్తుండటంతో బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసిన ఫలితం దక్కలేదు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు సోమవారం ఆదిబట్ల పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

ఉనికి కోల్పోతున్న చెరువులు

- అక్రమ దందాకు తెరలేపిన ఇటుక వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు



నందులకత్వ వాగులో అక్రమ తవ్వకాలతో ఏర్పడిన గుంత

కొత్తూరు: ఇటుక వ్యాపారుల ఆగడాలు మితిమీరుతున్నాయి. వీరి చర్యల వల్ల చెరువులు, కుంటలు, వాగులు ఉనికిని కోల్పోయే దుస్థితి నెలకొంది. గతంలో కొన్ని చోట్ల మిషన్ కాకతీయ ముసుగులో చెరువుల్లో నుంచి మట్టిని ఇటుక బట్టీలకు తరలించారు. మరికొన్ని చోట్ల ఎలాంటి అనుమతులు లేకున్నప్పటికీ పదుల సంఖ్యలో జేసీబీలు, టిప్పర్లతో రాత్రి వేళ అక్రమంగా మట్టిని ఎత్తుకెళ్తున్నారు. వీరి ఆగడాలను ప్రశ్నించే నాయకులకు కొంత మొత్తంలో ముట్టజెప్పుతున్నారు. అడ్డుకునే వారిపై దాడులకు సైతం వెనకాడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. చెరువుల్లో తవ్వకాలపై సమాచారం వచ్చినప్పటికీ స్పందించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు సకాలంలో స్పందించకపోవడం ఇటుక వ్యాపారులకు కలిసివస్తోందనే చర్చలున్నాయి. తమ దృష్టికి వచ్చిన ఘటనల్లో కొన్ని తవ్వకాలపై రెవెన్యూ అధికారులు కేసులు నమోదు చేసినప్పటికీ చెరువుల్లో నుంచి మాత్రం అక్రమ తవ్వకాలు ఆగడం లేదు.

ఉనికిని కోల్పోతున్న చెరువులు, కుంటలు... కొత్తూరు మున్సిపాలిటీతో పాటు మండలంలో రికార్డుల మేరకు 42 చెరువులు, కుంటలు ఉన్నాయి. వర్షాకాలంలో చెరువులు నిండితే సమీపంలోని వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరుగుతుంది. తద్వార రైతులు వరితో పాటు అయా రకాల పంటలను సాగు చేస్తున్నారు. కాగా కొందరు అక్రమార్కులు అనుమతులు పొందకుండానే యంత్రాలతో చెరువుల్లో నుండి మట్టి, మొరంను తవ్వి విక్రయిస్తున్నారు. యంత్రాలతో తవ్వడం వలన చెరువుల్లో గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో వర్షాకాలంలో చెరువులోకి నీరు చేరిన కొద్ది రోజుల్లోనే ఇంకిపోతున్నాయి.

మచ్చుకు కొన్ని ఘటనలు

- సిద్దాపూర్ శివారులోని చెరువులో గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఓ కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకుని వందలాది టిప్పర్ల మట్టిని తవ్వి మహేశ్వరం మండలంలో వేస్తున్న రోడ్డుకు తరలించారు.
- పెంజర్ల శివారులో ఉన్న మామిడోని చెరువులో గతేడాది అర్ధరాత్రి పదుల సంఖ్యలో జేసీబీలు, టిప్పర్లతో ఇటుక వ్యాపారులు మట్టిని తరలించారు. విషయాన్ని గుర్తించిన కొందరు స్థానికులు మట్టి తరలింపును అడ్డుకున్నారు. అప్పటికే వందల ట్రిప్పుల మట్టి బట్టీల వద్దకు తరలిపోయింది.
- గూడూరు శివారులోని నందులకత్వ వాగులో ఇటుక, మట్టి వ్యాపారులు అదను చూసి రాత్రి వేళల్లో మట్టి, మొరం తవ్వుతున్నారు. వాగులో తవ్వకాల కారణంగా వర్షాకాలంలో నీరు పంట పొలాల్లో ప్రవహిస్తోంది.
- మున్సిపాలిటీ పరిధిలోని సాయిరెడ్డి చెరువులో నాలుగేళ్ల క్రితం రియల్ వ్యాపారులు యంత్రాలతో పెద్ద ఎత్తున మొరం తరలించారు.

అధికారుల సమన్వయలోపం

చెరువులు, కుంటల్లో నుంచి మట్టిని తరలిస్తున్న సమయంలోనే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులకు స్థానికుల నుంచి సమాచారం అందుతుంది. కాగా వారు మట్టి తరలించడం రెవెన్యూ శాఖ పరిధిలోకి వస్తుందని.. రెవెన్యూ శాఖ అధికారులు చెరువు కాబట్టి ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వస్తుందని సమస్యను ఒకరిపై మరొకరు నెట్టుకోవడం పరపాటిగా మారింది. రెండు శాఖలకు చెందిన అధికారుల సమన్వయ లోపం కారణంగానే ఇటుక వ్యాపారులు ఇప్పటికీ రాత్రి వేళ చెరువుల్లోంచి మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కేసులు నమోదు చేశాం



అనుమతి లేకుండా ప్రభుత్వ భూములు, పాటుకాల్వలు, చెరువుల్లో నుంచి మట్టిని తవ్వడం, తరలించడం నేరం. ఇప్పటికే అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న పలువురికి జరిమానాలు విధించగా మరికొందరిపై కేసులు నమోదు చేశాం. ఇక మీదట చెరువులు, కుంటల్లో అక్రమంగా తవ్వకాలు జరిపినట్లు తెలిస్తే మా దృష్టికి తీసుకురావాలి. వెంటనే చర్యలు తీసుకుంటాం.

– రవీందర్‌రెడ్డి, తహసీల్దార్, కొత్తూరు

బాటకు అడ్డంగా కంపవేశారని కేసు

కొందుర్గు: బాటకు అడ్డంగా కంపచెట్లు వేశారని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపిన ప్రకారం.. టేకులపల్లి గ్రామానికి చెందిన బేగరి రాజు, మహేష్, లక్ష్మయ్య, పాండు ఈ నెల 5న గ్రామం నుంచి ఉత్తరాసిపల్లి మార్గంలో గ్రామం నుంచి షాబాద్ వెళ్లే దారికి అడ్డంగా ముళ్ల కంప వేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మల్లేష్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా పొలానికి వెళ్లే బాటను కొందరు వ్యక్తులు ఆక్రమించి బాటను బంద్ చేశారని, ఈ విషయమై తాము తహసీల్దార్, ఆర్‌డీఓకు విన్నవించుకున్నా ఫలితం రాకపోవడంతో ఈ బాటకు అడ్డంగా కంపచెట్లు వేశామని, ఇలాగైనా తమ సమస్య తీర్చుతారేమోనని ఆశించి బాటకు అడ్డంగా ముళ్లకంపను వేశామని నిందితులు రాజు తదితరులు తెలిపారు.

ఫ్యూచర్ సిటీలో విలీనం చేయండి

- మహేశ్వరం నుంచి కలెక్టరేట్ వరకు జేఏసీ నాయకుల బైక్‌ర్యాలీ
- ప్రజావాణిలో వినతిపత్రం అందజేత



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలం నుంచి కేవలం తుమ్మలూరు, మెహబ్బత్‌నగర్‌ను విలీనం చేసి మిగిలిన 28 పంచాయతీలను వదిలేశారన్నారు. గతంలో ప్రజా ప్రయోజనాల కోసం మహేశ్వరం మండల రైతులు సుమారు 20 వేల ఎకరాల భూమి కోల్పోయారన్నారు. ఫ్యూచర్ సిటీలో మండలాన్ని విలీనం చేస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని జేఏసీ నాయకులు తెలిపారు. ఇప్పటికైనా మండలంలోని మిగిలిన 28 పంచాయతీలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేసి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. ఈ మేరకు మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు బైక్ ర్యాలీగా వచ్చి ప్రజావాణిలో డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. త్వరలో సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి విలీనం చేయాలని కోరుతామన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఆర్‌ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి, ప్రధాన కార్యదర్శి యాదగిరిగౌడ్, గౌరవ అధ్యక్షుడు మనోహర్, జేఏసీ నాయకులు జంగయ్య, చంద్రయ్య, నర్సింహ, ఈశ్వర్, మోహన్‌రెడ్డి, యాదయ్య గౌడ్, దత్తు నాయక్, యాదీష్, సుదర్శన్ యాదవ్, రాజు నాయక్, పాండు నాయక్, నర్సింహ యాదవ్, రమేష్, సీతారామ్ నాయక్, విఠల్ నాయక్, లాజర్, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి బలవన్మరణం



రమేష్ (ఫైల్)

షాద్‌నగర్: చెట్టుకు ఉరేసుకుని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామానికి చెందిన పురుగుల రమేశ్(40) ఆదివారం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో సాధ్యమైన అన్ని ప్రాంతాల్లో వెతికారు. బైపాస్ రోడ్డులోని బుచ్చిగూడ అండర్‌పాస్ సమీపంలో ఉన్న సర్వీస్ రోడ్డులో ఓ గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరేసుకున్నట్లు సోషల్‌మీడియాలో షేర్ చేశారు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు ఘటనా స్థలికి చేరుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడా? ఎవరైనా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

రూ.92వేల నగదు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం

రాంగోపాల్‌పేట్: వెబ్‌సైట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురు నిందితులను సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్, మహంకాళి పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ సౌత్‌జోన్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపిన మేరకు.. ఢిల్లీకి చెందిన అడెం బెట్టింగ్ కోసం రాణీగంజ్‌కు చెందిన సందీప్ కుమార్ గోదెల (30), గోషామహాల్‌కు చెందిన సదానంద్ అభిషేక్ (31), మంగళ్‌హాట్‌కు చెందిన పద్మావార్ యశ్వంత్ గుప్తా(32), అదే ప్రాంతానికి చెందిన గంగారాం వినయ్ (32)లను బెట్టింగ్ కోసం నియమించుకున్నాడు. పాన్‌బజార్‌లోని ఓ ఇంట్లో కంప్యూటర్ పెట్టుకుని ఆన్‌లైన్‌లో ఐపీఎల్ ఖేలో డాట్ కామ్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఇందులో సందీప్ సబ్ బుకీ కాగా సదానంద్ అభిషేక్, పద్మావర్ యశ్వంత్‌లు ఫంటర్లు, గంగారాం వినయ్ సింగ్ కలెక్షన్ బాయ్‌గా పనిచేస్తున్నారు. ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్–గుజరాత్ టైటాన్స్ మధ్య జరుగుతున్న మ్యాచ్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు సౌత్‌జోన్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఎస్సైలు మహేష్, నర్సింహులు, ఆంజనేయులు, నవీన్, మహంకాళి ఎస్సై వెంకటేశ్వర్లు సంయుక్తంగా కలిసి దాడులుచేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి రూ 92,120తో పాటు 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసికున్నారు. ప్రధాన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ఆసిఫ్‌నగర్‌లో లిఫ్ట్ ప్రమాదం

విజయనగర్‌కాలనీ: లిఫ్ట్ కుప్పకూలడంతో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన సోమవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. లంగర్‌హౌజ్‌కు చెందిన సయ్యద్ నసీరుద్దీన్(40) వాహనాల పెయింటర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతని భార్య సికినాబేగం (35), మరదలు మైమునాభేగం(34)లు ఈ నెల 6న ఆసిఫ్‌నగర్ ప్రియా కాలనీలోని నాకో శ్యామ్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌కు రాత్రి 11.20 గంటలకు వచ్చారు. 5వ అంతస్తులో ఉన్న బంధువుల ఇంటికి లిఫ్ట్‌లో వెళ్తుండగా 4వ అంతస్తు వద్దకు చేరుకోగానే లిఫ్ట్ ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతోవారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వైద్య చికిత్సల నిమిత్తం అత్తాపూర్‌లోని జర్మన్‌టైన్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వారం రోజుల్లో 'డబుల్' ఇళ్లు



లింగంపల్లి గేట్ వద్ద డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి తదితరులు

ఇబ్రహీపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి

మంచాల: లబ్ధిదారులకు వారం రోజుల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేస్తామని ఇబ్రహీపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని లింగంపల్లి గేట్ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పంపిణీకి ముందే నివాస యోగ్యానికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, ఎంపీడీఓ బాలశంకర్, తహసీల్దార్ ఎంవీ ప్రసాద్, హౌసింగ్ ఏఈ రాంచంద్రయ్య, నాయకులు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, ఎడ్మా నరేందర్‌రెడ్డి, జెనిగె వెంకటేశ్, మల్లేష్, మూర్తి, ఐలయ్య, కరుణాకర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రవి, రాజేశ్, ఆర్ఐ రమేశ్ పాల్గొన్నారు.

మియాపూర్‌లో షెల్టర్!

- 'అఫ్జల్‌గంజ్ కాల్పుల' నిందితులు ఉన్నది అక్కడే
- శ్రీ సాయి గ్రాండ్ ఇన్ హోటల్‌లో ఐదు రోజుల పాటు మకాం
- బీదర్‌లో నేరం చేసి వచ్చి గది ఖాళీ చేసిన ద్వయం
- దర్యాప్తులో గుర్తించిన హైదరాబాద్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: కర్నాటకలోని బీదర్, నగరంలోని అఫ్జల్‌గంజ్‌లో తుపాకులతో విరుచుకుపడిన ఇద్దరు దుండగులు అమన్ కుమార్, అలోక్ కుమార్ ఈ నేరాలు చేయడానికి ముందు మియాపూర్‌లో బస చేసినట్లు వెలుగులోకి వచ్చింది. అఫ్జల్‌గంజ్ కాల్పుల కేసును వివిధ కోణాల్లో దర్యాప్తు చేసిన హైదరాబాద్ పోలీసులు ఈ విషయం గుర్తించారు. దీనికి సంబంధించిన రికార్డులను సైతం స్వాధీనం చేసుకున్నారు. నగరంలో నేరం చేసిన తర్వాత దేశ సరిహద్దులు దాటి నేపాల్ పారిపోయినట్లు ఈ ద్వయం ప్రస్తుతం నేపాల్‌లో ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు సేకరించారు.

జనవరి 12న నగరానికి రాక

బీహార్‌లోని వైశాలీ జిల్లా ఫతేపూర్ పుల్వారియాకు చెందిన అమన్ కుమార్, అలోక్ కుమార్ ఏటీఎం మిషన్లలో నగదు నింపే వాహనాలనే టార్గెట్‌గా చేసుకున్నారు. ఈ గ్యాంగ్ 2023 సెప్టెంబర్ 12న ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్‌లో సెక్యూరిటీ గార్డు జై సింగ్‌ను హత్య చేసి రూ.40 లక్షలు దోచుకుపోయింది. నేపాల్ పారిపోయిన ఈ గ్యాంగ్ యూపీ పోలీసుల హడావుడి తగ్గిన తర్వాత బీహార్ చేరుకుంది. అక్కడ నుంచి తమ స్వస్థలానికి వెళ్లి... ఈ ఏడాది జనవరిలో నగరానికి వచ్చింది. బీదర్‌ను టార్గెట్‌గా చేసుకున్న అమన్, అలోక్ ఆ నెల 12న మియాపూర్‌లోని శ్రీ సాయి గ్రాండ్ ఇన్ హోటల్‌లో బస చేసింది. అక్కడ నుంచి బీదర్‌కు రాకపోకలు సాగించడం తేలికనే ఉద్దేశంతోనే అక్కడ షెల్టర్ ఏర్పాటు చేసుకున్నట్లు పోలీసులు చెప్తున్నారు. అమిత్ కుమార్, మహేష్ కుమార్ పేర్లతో నకిలీ ఆధార్ కార్డులు తయారు చేసిన దుండగులు వాటి ఆధారంగానే రూమ్ తీసుకున్నారు.

మూడు రోజుల పాటు రెక్కీ

బీదర్‌లో ఎస్‌బీఐ ఏటీఎం మిషన్లలో నగదు నింపే సీఎంఎస్ సంస్థ వ్యాన్‌ను దోచుకోవడానికి ముందు మూడు రోజుల పాటు పక్కాగా రెక్కీ చేసింది. తమ వెంట తెచ్చుకున్న ద్విచక్ర వాహనంపై జనవరి 13, 14, 15 తేదీల్లో అక్కడకు వెళ్లి వస్తూ ఈ పని పూర్తి చేసింది. చివరకు ఆ నెల 16న నేరం చేయడానికి బీదర్ వెళ్లిన ఈ ద్వయం సీఎంఎస్ సంస్థ ఉద్యోగుల్లో గిరి వెంకటేష్‌ను చంపి, శివకుమార్‌ను గాయపరిచి రూ.83 లక్షలు దోచుకుంది. అక్కడ నుంచి డబ్బు నింపిన బ్యాగ్‌లు తీసుకుని నేరుగా తాము బస చేసిన హోటల్‌కే వచ్చారు. రూమ్ ఖాళీ చేయడంతో పాటు తమ వస్తువుల్నీ తీసుకుని ద్విచక్ర వాహనంపై బయలుదేరి మియాపూర్ నుంచి ఎంజీబీఎస్‌కు వచ్చారు. నేరం చేయడానికి వాడిన ద్విచక్ర వాహనాన్ని ఎంజీబీఎస్ పార్కింగ్‌లో ఉంచారు. అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ నుంచి ప్రైవేట్ బస్సులో రాయ్‌పూర్ వెళ్లేందుకు అమీత్‌కుమార్ పేరుతో టిక్కెట్ బుక్ చేసుకున్నారు.

నేపాల్‌లో ఉండటంతో పటిష్ఠ నిఘా

ఈ ట్రావెల్స్ వద్ద జరిగిన పరిణామాలతో మేనేజర్ జహంగీర్‌ను కాల్చిన ఇద్దరూ అక్కడ నుంచి పారిపోయారు. అఫ్జల్‌గంజ్ నుంచి ఆటోలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లిన వీళ్లు... అక్కడ నుంచి గజ్వేల్ వెళ్లడానికి మరో ఆటో మాట్లాడుకున్నారు. అనివార్య కారణాలతో తిరుమలగిరిలో దిగేసి... ఇంకో ఆటోలో మియాపూర్ వెళ్లారు. ఆపై తిరుపతి వెళ్లే ఏపీఎస్ఆర్టీసీ ఎక్కి కడపలో దిగిపోయారు. మరో బస్సులో నెల్లూరు, అట్నుంచి చెన్నై వెళ్లారు. చెన్నై నుంచి రైలులో కోల్‌కతా చేరుకున్న ఈ ద్వయం పశ్చిమ బెంగాల్‌లోని సిలిగురి ప్రాంతం నుంచి నేపాల్ వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. మీర్జాపూర్ నేరం తర్వాత ఇలా వెళ్లిన ఈ ద్వయం కొన్నాళ్లకు తమ స్వస్థలాలకు తిరిగి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం సిటీ పోలీసులు వారి కదలికలపై పటిష్ఠ నిఘా ఉంచారు.